క్లుప్తంగా

రుణాలు త్వరగా చెల్లించండి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీధర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్‌): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని పొదుపు మహిళలు స్త్రీనిధి, ఉన్నతి పథకాల్లో తీసుకున్న రుణాలను త్వరితగతిన చెల్లించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో డీఆర్‌డీఏ పరిధిలో పని చేస్తున్న డీపీఎం, ఏపీఎం, ఎల్‌సీ, జిల్లా సమాఖ్య, ఓబీ, ఈసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. రుణాలు వసూళ్లపై ఏపీఎంలు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే పొదుపు గ్రూపులలో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రుణాలు తీసుకుంటూ ప్రతి నెల సక్రమంగా చెల్లించే విధంగా చూడాలన్నారు.

ప్రైవేటు జూనియర్‌ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



జిల్లా ఇంటర్‌ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు

నంద్యాల(న్యూటౌన్‌): ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు, జూనియర్‌ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు డిమాండ్‌ చేశారు. శుక్రవారం జిల్లా ఇంటర్మీడియెట్‌ అధికారి శంకర్‌నాయక్‌ను కలిసి వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్‌ మాట్లాడుతూ ఇరుకు గదుల్లో ప్రైవేటు జూనియర్‌ కళాశాలలు నడుపుతున్నారన్నారు. పలు కాలేజీలకు ఆటస్థలాలు లేవన్నారు. అలాగే భారీగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా నాయకులు శశిధర్‌రెడ్డి, ధనుష్‌, రవి, తదితరులు పాల్గొన్నారు.

జీవాల ఆరోగ్యమే ధ్యేయం



గొర్రెలకు నట్టల మందు తాపుతున్న పశువైద్యాధికారి

శిరివెళ్ల: జీవాల ఆరోగ్యమే ధ్యేయంగా పని చేస్తున్నామని మండల పశువైద్యాధికారి దస్తగిరి అన్నారు. శుక్రవారం కాదరబాదరలో 1976 గొర్రెలు, 114 మేకలకు డీవార్మింగ్‌ మందులు తాపించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా జూన్‌ 26 నుంచి జూలై 10 వరకు గొర్రెలు, మేకలలో ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. మందు తాగించడం వలన జీవాల మరణాలను అరికట్టవచ్చునన్నారు. పాలు, మాసం, ఉన్ని దిగుబడి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి



ఆలమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రవరం: ప్రతి ఒక్కరు తమ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇళ్ల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆలమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అమర్నాథరెడ్డి అన్నారు. మలేరియా వ్యతిరేక నివారణ మాసోత్సవం సందర్భంగా శుక్రవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, మలేరియా సబ్‌యూనిట్‌ అధికారి శివచంద్రారెడ్డి కలిసి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారితో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే వాతావరణ మార్పుల వల్ల విరేచనాలు, వాంతులు అయ్యే అవకాశం ఉందని కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మాధవి లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి

నంద్యాల(అర్బన్‌): బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను మంత్రి ఫరూక్‌ శుక్రవారం అందజేశారు. స్థానిక కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన శీలం నిర్మలకు రూ.1.50 లక్షలు సీఎంఆర్‌ఎఫ్‌ చె అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ఆదుకోవడమే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు శివనాగిరెడ్డి, ప్రేమనాథరెడ్డి, రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు.

వాడుతున్న ఆశలు!

- ముఖం చాటేసి వరుణుడు
- ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు
- వర్షం కోసం ఎదురుచూపులు



సాగునీరు లేక వాడిపోతున్న మినుము పైరు

గోస్పాడు: వరుణదేవుడు ముఖం చాటేశాడు. దీంతో ముందస్తు వర్షాలకు సాగు చేసిన పంటలు వాడుముఖం పట్టడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఈఏడాది మే నెల నుంచే అడపాదడపా వర్షాలు కురిశాయి. పొలాలు పదును కావడంతో రైతన్నలు పంటల సాగుకు శ్రీకారం చ చుట్టారు. నంద్యాల నియోజకవర్గంలో ఖరీఫ్‌ సాధారణ విస్తీర్ణం 13 వేల హెక్టార్లకు పైగా ఉంది. ఇందులో వరి 7వేల హెక్టార్ల వరకు సాగవుతుంది. మిగతా విస్తీర్ణంలో కంది, మినుము, పెసర, సోయాబీన్స్‌, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు సాగవుతాయి. ఈ ఏడాది ముందస్తు వర్షాలకు రైతులు 1500 హెక్టార్ల దాకా వివిధ పంటలు వేశారు. గోస్పాడు మండలంలో యాళ్లూరు, జిల్లెల్ల, ఎం. చింతకుంట్ల, సాంబవరం, దీబగుంట్ల, కానాలపల్లె, నెహ్రూనగర్‌, జూలేపల్లె, గోస్పాడు తదితర గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.

పెట్టుబడులకు రూ. వేలకు వేలు ఖర్చు

గతేడాది రైతులకు ఖరీఫ్‌ కలిసి రాలేదు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వరి, మొక్కజొన్న, మినుము, పెసర పంటలు సాగు చేస్తే సరైన దిగుబడులు రాలేదు. వచ్చిన అరకొర దిగుబడికి మార్కెట్‌లో ధర లభించలేదు. దీంతో చాలా మంది రైతులు నష్టపోయారు. ఈసారి ముందస్తు వర్షాలు కురవడంతో ఆశలు చిగురించాయి. అప్పులు చేసి పంటల సాగుకు పూనుకున్నారు. విత్తనం, కూలీలు తదితర వాటికే ఎకరాకు 15 వేల వరకు ఖర్చు అయింది. ఈసారి ఖరీఫ్‌ కలిసి వస్తుందని అనుకుంటున్న సమయంలో వరుణదేవుడు ముఖం చాటేశాడు. దాదాపు రెండు వారాల నుంచి వానలు లేవు. దీంతో ఇప్పటికే సాగైన పంటలు వాడుముఖం పట్టాయి.



బెట్టపోతున్న మొక్కజొన్న పైరు

ఆదుకోని సర్కారు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా పథకం కింద రైతులకు ఏటా పెట్టుబడిసాయంగా రూ.13500 లభించేది. దీనికితోడు విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందేవి. దీంతో పంట సాగుకు రైతులు ఇబ్బంది పడేవారు కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గతేడాది నుంచి పైసా సాయం అందడం లేదు. సబ్సిడీ విత్తనాల ఊసే లేదు. దీంతో రైతులు సాగుకు అష్టకష్టాలు పడుతున్నారు. వడ్డీవ్యాపారుల వద్ద అప్పులు చేసి విత్తు వేస్తున్నారు.

మినుము పైరు సాగు చేశా



నేను 15 ఎకరాల్లో మినుము సాగుచేశా. మొదట్లో వర్షం కురిసి పొలాలు సాగుకు అనుకూలంగా ఉండటంతో కలిసి వస్తుందని పంట వేశాం . ఎకరాకు రూ. పదివేలకు పైగా ఖర్చు అయింది. విత్తనం మొలకెత్తిన తర్వాత వర్షం లేదు. దీంతో పంట వాడుముఖం పట్టింది. వరుణదేవుడు కరుణించకపోతే ఈసారి కూడా నష్టాలు చవిచూడాల్సి వస్తుంది.

– నాగేశ్వరరెడ్డి, సాంబవరం

గత సీజన్‌ కూడా కలిసి రాలేదు



గతేడాది ఖరీఫ్‌లో కూడా ముందస్తు వర్షాలకు పైర్లు సాగుచేశాం. అయితే సాగు చేసిన పైర్లు అంతంతమాత్రంగానే దిగుబడులు రావడంతో పెట్టుబడులు కూడా చేతికి అందలేదు. ఈఏడాదైనా కలిసి వస్తుందేమోననే ఆశతో పొలం కౌలుకు తీసుకుని మొక్కజొన్న పైరు సాగుచేశాను. ప్రస్తుతం వర్షం లేకపోవడంతో పైర్లు ఎండిపోతున్నాయి. ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు.

– ప్రసాద్‌యాదవ్‌, వసురపాడు

మొక్కుబడిగా మండల మీట్‌

- ప్రస్తావనకు రాని ప్రజా సమస్యలు
- ప్రగతి నివేదికలు చదవేందుకే పరిమితమైన అధికారులు
- పంట నష్టంపై కనీసం చర్చ చేపట్టని వైనం



సమావేశంలో ప్రగతి నివేదికను చదివి వినిపిస్తున్న వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి



సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అజెండాలో పొందుపరచిన అంశాల్లో భాగంగా వ్యవసాయ శాఖ, విద్యుత్‌, రెవెన్యూ, వైద్యం, పశు వైద్యం, తదితర శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. గ్రామాల్లో పలు సమస్యలతో సతమతమవుతున్నాయి. కనీస సౌకర్యాలు కరువయ్యాయి. గత ఏడాది ఖరీఫ్‌, రబీ సీజన్‌లలో రైతులు పంట బీమా చేయించారు. అయితే, జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారం నేటికీ అందలేదు. మండలంలో అధిక శాతం మిరప, సీడుపత్తి, పప్పుశనగ, మినుము, వివిధ రకాల పంటలు సాగు చేసి రైతులు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నారు. ఇలాంటి ఏ ఒక్క అంశం కూడా సభలో చర్చించకపోవడం, ప్రజా సమస్యలను ప్రస్తావించకపోవడం గమనార్హం. సర్వసభ్య సమావేశానికి హాజరైన సభ్యులు కుర్చీలకే పరిమితమయ్యారు. వచ్చామా ..వెళ్లామా అన్నట్లుగా ప్రజాప్రతినిధులు వ్యవహరించారు. దీంతో అధికారులు సైతం తమకు ఏమీ పట్టనట్లు సభను మమ అనిపించి ముగించారు. ఎంపీటీసీ సభ్యులు గగ్గెర వెంకటేశ్వర్లు, బాలిరెడ్డి, శివమ్మ, దేవి, గ్రామ సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుల ఇంటి వద్దకే రేషన్‌

శిరివెళ్ల: 65 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు వారి ఇళ్ల వద్ద రేషన్‌ పంపిణీ జరుగుతుందని తహసీల్దార్‌ జయశ్రీ శుక్రవారం తెలిపారు. మండలంలో 2,162 మందికి ఈ సదుపాయం ఉందన్నారు. అలాగే కొత్తగా వృద్ధులకు మిగతా వారి కన్నా ముందుగానే 5 రోజుల ముందు రేషన్‌ పంపిణీ జరుగుతుందన్నారు. డీలర్‌ స్వయంగా వారి ఇంటికి రేషన్‌ అందచేసి వేలి ముద్రలు తీసుకుంటారన్నారు.

పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న డీపీఓ లలితాబాయ్‌

ఆళ్లగడ్డ: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని డీపీఓ లలితాబాయ్‌ అన్నారు. రూరల్‌ మండలం నల్లగట్ల గ్రామంలో శుక్రవారం ఆమె పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు సీజనల్‌ వ్యాధుల బారిన పడకుండా వీధుల్లో మురుగునీరుతో పాటు చెత్తాచెదారం ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ బ్లీచింగ్‌ వేయాలన్నారు. మురుగునీరు నిల్వ ఉన్న చోట్ల దోమల నివారణకు ఆయిల్‌ బాల్స్‌ వేయాలని చెప్పారు. ఈమె వెంట ఎంపీడీఓ నూర్జహాన్‌, ఈఓపీఆర్డీ అశ్వస్‌ ఉన్నారు

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



చెంచుగూడెంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, నాయకులు

చాగలమర్రి: ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చెంచుగూడెంకు చెందిన మల్కి మహేంద్ర కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన గూడేనికి చేరుకొని వైఎస్సార్‌సీపీ తరఫున రూ.35,000 వేలు, 2 బస్తాల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ముందుగా కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం వల్ల కట్టుబట్టలతో రోడ్డున పడిన గిరిజన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరుపున అర్థిక సహాయం , పక్కా గృహం మంజూరయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఆయన గోడిగనూరులో 10 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు పత్తి నారాయణ సోదరుడు చిన్న నారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్న నారాయణ కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్‌ కార్యదర్శి వెంకటరమణ, మండల కార్యదర్శి శేషురమేష్‌, సర్పంచ్‌లు రేనాటి బాలీశ్వరరెడ్డి, రామిశెట్టి గోవిందయ్య, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీరెడ్డి, మాజీ మార్కెట్‌ యార్డ్‌ చైర్మన్‌ రవి, స్థానిక నాయకులు సుబ్బయ్య, శ్రీధర్‌, విజయ డెయిరీ దస్తగిరి, అంకాల్‌రెడ్డి, గురప్పా, రహిమాన్‌, చిన్నబికారి తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్‌): ప్రధాని మోదీ అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు ముమ్మరం చేద్దామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్‌, పట్టణ కార్యదర్శి ప్రసాద్‌, ఏఐఎస్‌ఎఫ్‌ జాతీయ మాజీ అధ్యక్షుడు మురళీధర్‌ అన్నారు. శనివారం పట్టణంలోని సంజీవనగర్‌ గేట్‌లో శాఖ మహాసభ, ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకుడు దానం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 11 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు శూన్యమన్నారు. నల్లధనాన్ని తీసుకొస్తామని చెప్పి మోసం చేశారన్నారు. పెట్టుబడిదారులకు మేలు చేయడమే లక్ష్యంగా బీజేపీ పాలన సాగుతుందని విమర్శించారు. ప్రస్తుతం యువతకు ఉద్యోగాలు లేవు, కార్మికులకు భద్రత లేదు అని చెప్పారు. కార్మికుల హక్కులు, చట్టాలను కాలరాస్తున్న మోదీ సర్కారుకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సీపీఐ పట్టణ మహాసభలు జూలై 8న నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, నాగరాముడు తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రిలో కొలువుదీరిన లాల్‌స్వామి



చాగలమర్రిలోని చిన్నమకానంలో కొలువుదీరిన లాల్‌స్వామి

చాగలమర్రి: మొహర్రం పండుగను పురస్కరించుకొని చాగలమర్రిలోని చిన్నమకానం వీధిలో శ్రీలాల్‌స్వామి పీరును శుక్రవారం రాత్రి కమిటీ సభ్యులు కొలువుదీర్చారు. మత సామరస్యానికి ప్రతికగా నిలిచే ఈ వేడుకను గ్రామంలో13 రోజుల పాటు నిర్వహిస్తారు. తొలి రోజు వేల సంఖ్యలో హాజరైన భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చేనెల 5 వ తేదీన అర్ధరాత్రి లాల్‌స్వామి పీరు ఊరేగింపు, 09వ తేది జియారత్‌ కార్యక్రమం ఉంటుందని లాల్‌స్వామి కమిటీ అధ్యక్షుడు ముల్లా జిలానీ, ఉపాధ్యక్షుడు చక్రం షబ్బీర్‌, ప్రధాన కార్యదర్శి ముల్లా ఖాదర్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి ముల్లా ఇబ్రహీం, కోశాధికారి ముల్లా రఫీ, కమిటీ సభ్యులు ముల్లా షఫి, ముల్లా షంషీర్‌, ముల్లా దాదాపీర్‌ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో మహిళా ఆత్మహత్య



మృతిచెందిన స్వర్ణలత

బనగానపల్లె: నందివర్గం పోలీసు స్టేషన్‌ పరిధిలోని కైప గ్రామంలో శుక్రవారం ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రాజేష్‌తో కడప పట్టణం వైఎస్సార్‌ నగర్‌కు చెందిన స్వర్ణలత(28)ను పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే కుటుంబ కలహాలతో దంపతులు ఘర్షణ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన స్వర్ణలత రసాయన పదార్థాన్ని నీటిలో కలుపుకుని తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలు సోదరుడు దేవరాజ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

హోరాహోరీగా క్రికెట్‌ టోర్నమెంట్‌



కొనసాగుతున్న క్రికెట్‌ పోటీలు

శ్రీశైలంటెంపుల్‌: శ్రీశైలంలో శుక్రవారం క్రికెట్‌ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. మల్లికార్జుననాయక్‌ జ్ఞాపకార్థం కాలో ప్రీమియర్‌ లీగ్‌ సీజన్‌-1 టోర్నమెంట్‌ను వారి మిత్ర బృందం నిర్వహిస్తోంది. 40 జట్లు పాల్గొన్నాయి.మొదటి బహుమతి కాలో ప్రీమియర్‌ లీగ్‌ సీజన్‌-1 నిర్వాహకులు రూ.1,35,000, రెండవ బహుమతి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్‌రెడ్డి రూ.75,000, మూడవ బహుమతి రూ.40,000 నగదుతోపాటు కప్పును జక్కంపూడి మణికంఠ అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహిళలను గౌరవించాలి

నందికొట్కూరు: సమాజంలో మహిళలను గౌరవించాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్‌ ప్రజలకు సూచించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, నేరాలపై శుక్రవారం మండల పరిధిలోని వడ్డెమాను గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ద్విచక్రవాహనంపై వెళ్లే ప్రతి ఒక్కరు హెల్మెట్‌ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రూరల్‌ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ తిరుపాలు, సర్పంచ్‌ రామచంద్రుడు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు ద్వారానే మిర్చి కొనుగోలు జరగాలి

నంద్యాల(అర్బన్‌): మార్కెట్‌యార్డు ద్వారా మిర్చి కొనుగోలు జరిగేలా చూడాలని నంద్యాల మిర్చి యార్డు కమీషన్‌ ఏజెంట్లు గిరిబాబు, నరసింహారెడ్డి, ఇంద్రసేనారెడ్డి కోరారు. శుక్రవారం మార్కెట్‌ యార్డు చైర్మన్‌ హరిబాబును కలిసి రైతులు మార్కెట్‌యార్డుకు వచ్చేలా చూడాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్కెట్‌యార్డులో మిర్చి కొనుగోలు జరిగితే వ్యాపారుల మధ్య పోటీతత్వం పెరిగి రైతులకు లాభాలు చేకూరుతాయన్నారు. అలా కాకుండా అనధికారికంగా కోల్డ్‌ స్టోరేజీల వద్ద మిర్చి కొనుగోళ్లు జరిపితే నష్టం వస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి శేషిరెడ్డి, సూపర్‌వైజర్‌ శ్రీనివాసులు, డైరెక్టర్‌ స్వామినాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లపై అధికారుల దాడులు

నంద్యాల(అర్బన్‌): కమర్షియల్‌ సిలిండర్లు వాడాల్సిన హోటళ్ల యజమానులు డొమెస్టిక్‌ సిలిండర్లు వాడుతున్నారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం సాయంత్రం పట్టణంలోని పలు హోటళ్లపై సివిల్‌ సప్లయ్‌ అధికారులు దాడులు చేశారు. స్థానిక చార్మినార్‌, ఆదిత్య, రమ్యా తదితర హోటళ్లపై తనిఖీలు నిర్వహించి 5 డొమెస్టిక్‌ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. సీఎస్‌డీటీ ప్రసాదరావు మాట్లాడుతూ.. కమర్షియల్‌ సిలిండర్ల స్థానంలో డొమెస్టిక్‌ సిలిండర్లు వాడటం నేరమని, అటువంటి వారిపై 6ఏ కింద కేసు నమోదు అవుతుందన్నారు. హోటళ్ల యజమానులు కమర్షియల్‌ సిలిండర్లను వాడాలని సూచించారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్‌: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మకు విశేషపూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న భక్తి గీతాలు

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిత్యకళావేదికపై వనపర్తికి చెందిన సత్యం, బృందం వారి భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. నమామి విఘ్నేశ్వర, ఎవరికి ఎవరయ్యా ఈశ్వరా, నల్లమల కొండల్లో, శంకరా నాథా, ఓం నమఃశివాయా, శ్రీశైలగిరి యందు, శ్రీశైలమల్లన్నా తదితర గీతాలను సత్యంస్వామి, శివశంకర్‌, శేఖర్‌, కృష్ణచైతన్య, నాగరాజు, పరమేశ్వర్‌ తదితరులు ఆలపించారు.

భక్తి శ్రద్ధలతో అమ్మవార్లకు సారె సమర్పణ



కోదండ రామాలయంలోని అమ్మవారికి సమర్పించిన సారె



ప్రత్యేక అలంకారంలో శ్రీకాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో వెలసిన శ్రీజగజ్జననీ అమ్మవారికి, శ్రీకాళికాంబాదేవికి, శ్రీలలితా త్రిపుర సుందరి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకొని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి సారె సమర్పించి కోరికలు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా జగజ్జననీ ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అమ్మవారి ప్రతిమను అలంకరించి పుట్టింటి పట్టుచీర, సారెను మేళతాళాలతో తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం దుర్గా ఫ్రెండ్స్‌ యూనిట్‌ సభ్యులు భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. నందమూరినగర్‌లోని శ్రీకోదండ రామాలయం నందు వెలసిన లలితా త్రిపుర సుందరి, అన్నపూర్ణేశ్వరి, శ్రీలక్ష్మీదేవి అమ్మవార్లకు భక్తులు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సారె సమర్పించారు. శ్రీకాళికాంబా చంద్రశేఖరదేవస్థానంలో అమ్మవారికి ఒడి బియ్యం పోశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించి నవ విధ హారతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, దేవస్థానం చైర్మన్‌ ఆరవేటి వాసు, విజయ్‌కుమార్‌, రమేష్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్‌

నంద్యాల(అర్బన్‌): జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన టెక్కె మార్కెట్‌ యార్డులోని గోడౌన్లను శుక్రవారం జిల్లా కలెక్టర్‌ రాజకుమారి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్లకు వేసిన సీళ్లను, ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను తనిఖీ చేసి పర్యవేక్షణ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ఈవీఎంల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామునాయక్‌, ఆర్‌డీఓ విశ్వనాథ్‌, పలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు



మహానందిలో పల్లకీసేవ

మహానంది: మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ ఇన్‌చార్జ్‌ సూపరింటెండెంట్‌ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపంలో వేద పండితులు, అర్చకులు గంగ, కామేశ్వరీ దేవి, మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, అలంకార హారతులు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువు తీర్చారు. బలిహరణ పూజల తర్వాత ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల పల్లకీ ఉత్సవం నిర్వహించారు.